క్లుప్తంగా

కన్నుల పండువగా రథోత్సవం



రథం లాగుతున్న భక్తజనం

ఆమనగల్లు: కడ్తాల్ మండల పరిధి మక్తమాధారం గ్రామం శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం తెల్లవారుజామున రథంపై ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించి, ఆలయ నిర్వాహకులు వింజమూరి రామానుజచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథాన్ని భక్తులు తాళ్లతో లాగి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, స్థానిక నాయకులు గోపాల్, సాయిలు, చంద్రమౌళి, మాజీ సర్పంచ్ సులోచన తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్‌కు సన్మానం



ఝాన్సీరాణిని సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు: మాజీ కౌన్సిలర్ సుందూరు ఝాన్సీరాణిని బీజేపీ నాయకులు, శాంతినగర్ కాలనీవాసులు ఘనంగా సత్కరించారు. పట్టణంలోని శాంతినగర్ కాలనీలో బుధవారం ఝాన్సీరాణితో పాటు శేఖర్, కోఆప్షన్ మాజీ సభ్యులు మేడిశెట్టి శ్రీధర్, పాషలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవిరాథోడ్, శ్రీనివాసచారి, బుచ్చయ్య, ఆనంద్, యాదయ్య, శ్రీధర్, రమేశ్, శ్రీను, వెంకటేశ్, సందీప్, నరేశ్, సురేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఆచారి

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధి చంద్రాయణ పల్లితండాకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి సమక్షంలో, మాజీ కౌన్సిలర్ కృష్ణనాయక్ ఆధ్వర్యంలో కాషాయం కండువా కప్పుకొన్నారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపాలిటీ కన్వీనర్ కర్నాటి విక్రంరెడ్డి, నాయకులు నర్సింహ, కృష్ణయాదవ్, లక్ష్మణ్, రవిరాథోడ్, పద్మప్రకాంత్, విష్ణుచారి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న నాయకులు

మాడ్గుల: నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరమని బీఆర్‌ఎస్ నాయకుడు పవన్ కుమార్ రెడ్డి అన్నారు. మండల పరిధి కలకొండ గ్రామనికి చెందిన డొంకి రాము, బాలమని కుటుంబానికి రూ.50 వేల చెక్కు మంజూరు కాగా.. బుధవారం లబ్ధిదారులకు ఆయన అందజేసి మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్యచికిత్స చేయించుకోలేక ఆర్థిక ఇబ్బంది పడుతున్న పేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఆసరాగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాజావర్ధన్ రెడ్డి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా వెలుస్తున్న హోర్డింగ్‌లు



కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న యువకులు

ఇబ్రహీంపట్నం రూరల్: అనుమతి లేకుండా రాత్రికి రాత్రే కలెక్టరేట్‌కు వెళ్లే రహదారిలో మూడు హోర్డింగులు వెలిశాయని, వాటిని ఏర్పాటు చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కొంగరకలాన్ యువకులు నర్సగళ్ల ప్రవీణ్, కాకి రాఘవేందర్, గోదాసు మధు, రావుల శివశంకర్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే దీనికి కారణమని ఆరోపించారు. ఇదే విషయమై హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

‘పంచాయతీ’ సందడి

- స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఆశావహుల ఎదురుచూపు
- షెడ్యూల్ ప్రకటించడమే తరువాయి
- గుబులు రేపుతున్న రిజర్వేషన్లు



మంచాల/యాచారం: గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. ఏడాది కాలంగా పల్లెల్లో ప్రత్యేక పాలన కొనసాగుతున్న నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తుండగా, ఆశావహుల సందడి షురూ అయింది. పరిచయ కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నారు. ఇది మా వీధి, మా కులం, మా క్లాస్‌మెట్ అంటూ కాలికి బలపం కట్టుకుని ఓటర్లను ఆకట్టుకునే పనిలో బిజీగా ఉన్నారు. ఎవరింట ఎలాంటి కార్యక్రమం జరిగినా ముందువరుసలో నిలుస్తున్నారు. దావతులు చేస్తున్నారు. చేసుకుంటున్నారు.

రిజర్వేషన్ల గుబులు

రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేయడంతో స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు మారే అవకాశం ఉంది. రిజర్వేషన్లు ఎలా ఉండబోతాయోనన్న గుబులు ఆశావహులను వెంటాడుతోంది. అయినా.. ఆశతో ప్రజల్లో తిరుగుతున్నారు. విందులు, వినోదాల్లో పాల్గొంటూ తమ ఉనికిని చాటుకుంటున్నారు. ప్రభుత్వం స్థానిక ఎన్నికల అంశం తెరమీదకు తెచ్చినప్పుడల్లా.. స్థానికంగా ఉండని వారు సైతం .. గ్రామాల్లో హంగామా చేస్తున్నారు.

పోటీ తీవ్రం..

ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడమే ఆలస్యమన్నట్లుగా పల్లెల్లో రాజకీయ వేడి రాజుకుంటోంది. ఏదేమైనా మండలంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల మధ్య తీవ్ర పోటీ ఉండనుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బీజేపీ కొత్త ఓటర్లపై ఆశతో ఉంది. సీపీఎం గతంలో పోటీ చేసిన గ్రామాల్లో పట్టు సాధించేందుకు కృషి చేస్తోంది. స్థానిక ఎన్నికల్లో టికెట్ రాని పక్షంలో ఆశావహులు పార్టీలు మారే అవకాశం లేకపోలేదు. ఇలాంటి పరిస్థితులు ప్రతి ఎన్నికలోనూ తెరపైకి వస్తూనే ఉంటాయి. ఏది ఏమైనప్పటికీ.. ఎలాంటి రాజకీయ పార్టీల గుర్తులు లేకుండా జరిగే పంచాయతీ ఎన్నికలు రసవత్తరంగా జరగనున్నాయి.

పెరగనున్న బీసీ సీట్లు

యాచారం మండలంలో 24 గ్రామ పంచాయతీలు, 14 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే మండలంలో బీసీ సీట్లు గతం కంటే పెరిగే అవకాశం ఉంది. గతంలో కేవలం గడ్డమల్లయ్యగూడ, మల్కీజ్‌గూడ పంచాయతీలనే బీసీలకు రిజర్వు చేశారు. అదే విధంగా మల్కీజ్‌గూడ, నల్లవెల్లి ఎంపీటీసీ స్థానాలకు బీసీలకు రిజర్వు చేశారు. బీసీలకు అనుకున్న రిజర్వేషన్లు అమలు చేస్తే పంచాయతీల్లో 8 నుంచి పది, ఎంపీటీసీల్లో 5 స్థానాలకు పైగా రిజర్వేషన్లు పెరిగే అవకాశం ఉంది. యాచారం, మాల్, నందివనపర్తి, గునుగల్, చింతపట్ల, కొత్తపల్లి తదితర మేజర్ గ్రామాల్లో గతంలో అత్యధికంగా జనరల్ అభ్యర్థులే పోటీ చేసి సర్పంచులు, ఎంపీటీసీలుగా గెలిచారు. ఈ సారి రిజర్వేషన్లతో బీసీ నేతల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

తగ్గనున్న ఎస్సీ,ఎస్టీ సీట్లు

బీసీ రిజర్వేషన్లు పెంచితే ఎస్సీ,ఎస్టీ సీట్లల్లో కోత ఏర్పడనుంది. గతంలో 24 జీపీలకు గాను ఎస్సీలకు ధర్మన్నగూడెం, గునుగల్, మొండిగౌరెల్లి, తక్కళ్లపల్లి, తాడిపర్తి, చింతుల్ల, నానక్‌నగర్, ఎంపీటీసీ స్థానాల్లో.. నక్కర్తమేడిపల్లి, తాడిపర్తి, చింతుల్ల, చింతపట్ల గ్రామాలను కేటాయించారు. అదే గ్రామాల్లో ఎస్టీలకు అయ్యవారిగూడెం, మంతన్‌గౌరెల్లి, ఎంపీటీసీ స్థానాల్లో మంతన్‌గౌరెల్లి గ్రామాన్ని ఎంపిక చేశారు. ఈ దఫా ఎస్టీ స్థానాల్లో తేడా లేకున్నా, ఎస్సీ, జనరల్ స్థానాల్లో కోత పడి బీసీలకు రిజర్వేషన్లు చేసే అవకాశం లేకపోలేదు. ఎస్సీ రిజర్వేషన్లలో ఏ గ్రామంలో ఎస్సీ ఓటు బ్యాంకు అత్యధికంగా ఉందో అదే గ్రామాలను ప్రాధాన్యత కింద రిజర్వేషన్లు ప్రకటించే అవకాశం ఉంటుంది.

40, 848 ఓటర్లు

మంచాల మండల పరిధిలో 23 గ్రామ పంచాయతీలు, 13 ఎంపీటీసీ, ఒక జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మండలంలో 40వేల 848 ఓటర్లు ఉన్నారు. ఇందులో 20వేల725 పురుషులు, 20వేల 122 స్త్రీలు, ఒకరు ఇతరులు ఉన్నారు. గతంలో 23 పంచాయతీల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు 6, బీఆర్‌ఎస్ 11, సీపీఎం 4, బీజేపీ 2 చొప్పున గెలిచాయి. 13 ఎంపీటీసీ స్థానాల్లో కాంగ్రెస్ 6, బీఆర్‌ఎస్ 5, సీపీఎం ఒకటి, బీజేపీ ఒకటి చొప్పున కైవసం చేసుకున్నాయి. జెడ్పీటీసీని కాంగ్రెస్ దక్కించుకుంది. ఈ సారి పోటీ తీవ్రత పెరిగింది.

ఆదేశాలు రాలేదు



రిజర్వేషన్లు ఏ విధంగా చేయాలో ఆదేశాలు రాలేదు. ఎప్పుడు ఎన్నికలు పెట్టినా నిర్వహించేందుకు గాను సిద్ధంగా ఉన్నాం. సర్పంచులు, ఎంపీటీసీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశాం. ప్రభుత్వ ఆదేశాలు రావడమే ఆలస్యం.

– నరేందర్‌రెడ్డి, ఎంపీడీఓ యాచారం

దేశ ప్రజలు మెచ్చిన బడ్జెట్



ఇబ్రహీంపట్నం రూరల్: బొంగ్లూర్ చౌరస్తాలో మోదీ, నిర్మల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ శ్రేణులు

- ఉద్యోగులు, ప్రజలకు ఊరట: బీజేపీ
- ప్రధాని, ఆర్థిక మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

ఇబ్రహీంపట్నం రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ప్రజలందరూ మెచ్చుకున్నారని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ అన్నారు. పార్టీ ఆదిబట్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి అధ్యక్షతన బుధవారం బొంగ్లూర్ గేటు వద్ద ప్రధాని మోదీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడంతో ఉద్యోగులు, మధ్యతరగతి వర్గాలు హర్షం వ్యక్తంచేస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, పార్లమెంట్ కోకన్వీనర్ నారాయణ యాదవ్, బూర దిలీప్, మనోహర్‌లాల్, అశోక్‌గౌడ్, శ్రీదేవి, దేవదాస్, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్, గణేశ్‌గౌడ్, జంగయ్య, బాబుగౌడ్, అయిలయ్య పాల్గొన్నారు.

బలహీన వర్గాలకు మేలు

మంచాల: కేంద్రంప్రవేశ పెట్టిన బడ్జెట్ బలహీన వర్గాలకు మేలు చేసే విధంగా ఉందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దన్నె భాషయ్య అన్నారు. మండల కేంద్రంలో ప్రధాని చిత్ర పటానికి పార్టీ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు నూకం రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ ఎస్సీమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాశ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు శివరాల పాండు, నాయకులు నరేందర్‌గౌడ్, ఐలయ్య, విజయ్, వినోద్, సురేష్, పూర్ణచందర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



మంచాలలో..

కులగణన పచ్చి బూటకం

మంచాల: కులగణన పచ్చి బూటకమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. గణన అనంతరం న్యాయం చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. 7శాతం ఉన్న ఓసీలను 15శాతానికి పెంచి, బీసీలను తక్కువ చేసి చూపించడం దారుణమన్నారు. రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో తీవ్ర అన్యాయానికి గురవుతున్న బీసీలను మోసం చేస్తుందని విమర్శించారు. చట్టసభల్లో తప్పుడు లెక్కలు చూపించి బీసీలు, ఎస్సీలకు అన్యాయం చేసి, ఓసీలకు లబ్ధి చేకూర్చే విధంగా ప్రభుత్వం వ్యవహరించడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ తీరును బీసీలంతా ఎండగట్టాలని పిలుపునిచ్చారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఎస్సీ,ఎస్టీ, బీసీలు హక్కుల కోసం పోరాటాలు చేయాలని, త్వరలో బీసీ ఉద్యమాలకు శ్రీకారం చుడతామని ఆయన వెల్లడించారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

ఆమనగల్లు: పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ చలో సెక్రటేరియట్‌కు సర్పంచ్‌ల సంఘం పిలుపునిచ్చిన నేపథ్యంలో.. మాజీ సర్పంచ్‌లు లక్ష్మణ్, శ్రీనునాయక్, కడారి యాదయ్యలను పోలీసులు బుధవారం ముందస్తుగా అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలి పెట్టారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ.. సర్పంచుల సంఘం ఇచ్చిన పిలుపు నేపథ్యంలో.. మాజీ సర్పంచులను ఇబ్రహీంపట్నం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం ఠాణాకు తరలించారు. అరెస్టు అయిన వారిలో రాయపోల్, తులెకలాన్ మాజీ సర్పంచ్‌లు గంగిరెడ్డి బల్వంత్‌రెడ్డి, చిలుకల యాదగిరి ఉన్నారు. కొద్దిసేపటి తరువాత వారిని వదిలిపెట్టారు.

మాలల నిరసనను భగ్నం చేసిన పోలీసులు

ఇబ్రహీంపట్నం: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం మాలలు చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. ఈ సందర్భంగా పలువురు రోడ్డుకు అడ్డంగా బైఠాయించేందుకు యత్నిస్తూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో నేతలు ఎల్.మారయ్య, ఈగల రాములు, ఎ. కిష్టయ్య, అంగత్‌కుమార్, మల్లేశం, బాలచందర్, మూర్తి, యంజాల లక్ష్మయ్య, భర్తకి రాజులు పాల్గొన్నారు.

8న బీఆర్‌ఎస్ సమావేశం

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ పార్టీ ఇబ్రహీంపట్నం మండల నాయకుల సమావేశం 8వ తేదీన స్థానిక శాస్త్ర గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుగ్గరాములు, ప్రధాన కార్యదర్శి బాస్కర్‌రెడ్డిలు తెలిపారు. సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. గ్రామాల వారీగా పార్టీ శ్రేణులతో సమావేశాలను ఏర్పాటు చేసి, మండల సమావేశానికి వారిని సమాయత్తం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

వర్గీకరణ కాంగ్రెస్‌తోనే సాధ్యమైంది

పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నర్సింహ

మహేశ్వరం: ఎస్సీ వర్గీకణ అమలు కాంగ్రెస్‌తోనే సాధ్యమైందని రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ నందిగామ నర్సింహ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దళిత, బీసీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణతో 30 ఏళ్ల కల సంపూర్ణంగా సాకారం కాబోతుందన్నారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబడుతుందన్నారు. బీసీల కులగణన చేసి ఎవరి వాటా ఎంతో తేల్చి వారికి రిజర్వేషన్లు ఇవ్వనుందన్నారు. రిజర్వేషన్లు అమల్లోకి వచ్చి ఇన్నేళ్లయినా కొన్ని వర్గాల్లో ఇంకా అసమానతలు కొనసాగుతున్నాయన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్ తదితరులు ఉన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

తీరనున్న మూడు దశాబ్దాల కల



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: ఎస్సీ వర్గీకరణతో మూడు దశాబ్దాల కల సాకారం కాబోతుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. వర్గీకరణ బిల్లు శాసనసభలో ఆమోదం పొందిన నేపథ్యంలో కడ్తాల్ మండల కేంద్రంలో బుధవారం ఆ పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షుడు పోతుగంటి అశోక్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడురి భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, గిరిజన సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, కాంగ్రెస్ నాయకులు సీలారీ, పర్వతాలు యాదవ్, జహంగీర్ అలీ, మంకీ శ్రీను, దాసు, వెంకటేశ్, నర్సింహ ఉన్నారు.

పాఠశాలకు ఫ్యాన్లు వితరణ



పాఠశాలకు ఫ్యాన్లు అందజేస్తున్న దాత

ఇబ్రహీంపట్నం రూరల్: రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని, విద్యార్థుల శ్రేయస్సుకోసం ఆదిబట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గౌరీశంకర్ అనే వ్యక్తి రెండు స్టాండ్ ఫ్యాన్లు అందజేశారు. వీటిని బుధవారం ప్రధానోపాధ్యాయుడు పరమేష్‌తో పాటు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, బాషయ్య, రజిత పాల్గొన్నారు.

భయం వద్దు

పబ్లిక్ పరీక్షలు అంటే భయపడాల్సిన అవసరం లేదని మోటివేషనల్ స్పీకర్ మిరియాల రాజు అన్నారు. కొంగరకలాన్ జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రేరణ, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు పరమేష్, ఉపాధ్యాయులు హరిప్రసాద్, పాండు ఉన్నారు.

9న బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

యాచారం: ఈ నెల 9న బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నామని ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌గౌడ్, బాషలు తెలిపారు. సమీక్షకు ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి రానున్నారని పేర్కొన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడాది దాటినా ఏ ఒక్క హామీని సరిగా అమలు చేయలేదని ఆరోపించారు. ఓటమి భయంతో స్థానిక సంస్థల ఎన్నికలను సకాలంలో నిర్వహించలేకపోతుందని విమర్శించారు. ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని, పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి ఖాయమన్నారు. ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు లిక్కి నర్సింహారెడ్డి, యాదయ్యగౌడ్, జగదీష్, సత్యపాల్, శంకర్‌నాయక్, హబీబుద్దీన్, గోపాల్, ఖాజ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

ఆమనగల్లు: మండల పరిధి శెట్టిపల్లిలో అలివేలు మంగ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. మహిళల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోదాదేవి సత్యం, ఆలయ చైర్మన్ శ్రీనివాస్, ఆలయ ట్రస్టీ జగన్, నాయకులు వెంకటయ్య, వెంకటేశ్, రమేశ్, వీరాచారి, జంగయ్యగౌడ్, వెంకటచారి, చంద్రమౌళి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



వేంకటేశ్వర స్వామి సన్నిధిలో భక్తులు

తలకొండపల్లిలో..

మండల కేంద్రంలోని శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



పుస్తకాలు అందజేస్తున్న ఇన్‌చార్జి హెచ్‌ఎం

తుర్కయంజాల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న బాలబాలికలు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు దీటుగా మార్కులు సాధించాలని పురపాలక సంఘం పరిధి కొహెడ ప్రభుత్వ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు దన్నె రాజు సూచించారు. బుధవారం సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు విజయ్‌తో కలిసి ఆయన విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు. ఉపాధ్యాయులు లక్ష్మణ్, గోపాల్ రెడ్డి, కొండయ్య, ఉమా మహేశ్వరి, రాధ మాధవి, అమర్‌సింగ్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

హయత్‌నగర్: తుర్కయాంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్ శ్రీ రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. బుధవారం ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వారికి కావల్సిన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ఆలయంలో జరిగే కార్యక్రమాలను ప్రజలకు తెలిసే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అనీల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ యాదిరెడ్డి, నాయకులు సంరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎల్లయ్య, భూషన్, ధన్‌రాజ్‌గౌడ్, నక్క శివలింగం తదితరులు పాల్గొన్నారు.



యజ్ఞంలో మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు

పాఠశాలలకు ఫస్ట్ ఎయిడ్ కిట్ ఇవ్వాలి



మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నేతలు

ఇబ్రహీంపట్నం: ప్రతి ప్రభుత్వ పాఠశాలకు ఫస్ట్ ఎయిడ్ కిట్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ కీర్తనకు పీఆర్టీయూ నేతలు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించారని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పరకాల పరమేష్, రాజు, హరిప్రసాద్‌లు తెలిపారు.

బీసీల అభ్యున్నతే లక్ష్యం

మహేశ్వరం: బీసీల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పార్టీ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం మండల పరిధి మన్సాన్‌పల్లిలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాహుల్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో బీసీల కులగణన చేశామని, పదేళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాలను, ముఖ్యంగా బీసీలను అణగదొక్కిందని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో 34 శాతంగా ఉన్న బీసీ రిజర్వేషన్లను 23 శాతానికి తగ్గించి, వారికి తీరని అన్యాయం చేసిందని, ఇప్పుడు అదే అంశంపై పోరాటం చేస్తామనడం సిగ్గుచేటన్నారు. బీఆర్‌ఎస్‌కు బీసీ కులగణపై మాట్లాడే హక్కు లేదన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ అమలు చారిత్రాత్మకమైందన్నారు.

ఉత్సవాలకు ఆహ్వానం

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామంలో వెలసిన శ్రీ వేదాద్రి లక్ష్మీ నర్సింహ స్వామి దేవాలయంలో ఈ నెల 7 నుంచి 9 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు పలువురిని ఆహ్వానించారు. షాద్‌నగర్ మండల కేంద్రంలో బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నగరంలో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్‌లకు ఆలయ ధర్మకర్త శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకట్‌రెడ్డి, అశోక్, నర్సింహులు, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



పీసీసీ సభ్యుడికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు